సాక్షి కామారెడ్డి

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



గజ్వేల్ వెళ్లి తీరుతాం

కేసులకు భయపడేది లేదని, గజ్వేల్‌కు వెళ్లి తీరుతామని బీజేపీ నేత వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు.

- 8లో ▸



సీపీఎస్ రద్దు చేయాలి

సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలిపారు.

- 9లో ▸

వాతావరణం


గరిష్టం/కనిష్టం 37.0 /23.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

ఎల్లారెడ్డిలో అదృష్టమెవరిదో?

అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో కసరత్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఆశావహులనుంచి దరఖాస్తులు స్వీకరించిన పార్టీ.. వాటిని పరిశీలిస్తోంది. జిల్లాలో ఎల్లారెడ్డి టికెట్టును ఇద్దరు బలమైన అభ్యర్థులు ఆశిస్తుండడంతో ఈ స్థానంపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. టికెట్టు ఎవరిని వరిస్తుందా అన్న అంశంపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

- కాంగ్రెస్ టికెట్టు కోసం ఇద్దరు నేతల మధ్య తీవ్ర పోటీ
- రేవంత్‌రెడ్డిని నమ్ముకున్న సుభాష్‌రెడ్డి
- రాహుల్ టీంతో మదన్‌మోహన్‌రావు ప్రయత్నాలు



సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. గతంలో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంనుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చిన మదన్ మోహన్‌రావుతోపాటు మరోనేత వడ్డేపల్లి సుభాష్ రెడ్డి టికెట్టు ఆశిస్తున్నారు. ఇద్దరు నేతలు చాలాకాలంగా నియోజకవర్గంలో ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సుభాష్‌రెడ్డి టికెట్టు ఆశించగా.. జాజాల సురేందర్‌కు దక్కింది. మదన్‌మోహన్‌రావు 2019 ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన జాజాల సురేందర్ పార్లమెంట్ ఎన్నికలకు ముందే గులాబీ కండువా కప్పుకున్నారు. సురేందర్ వెంట కొందరు కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటినుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జీగా సుభాష్‌రెడ్డి కొనసాగుతూ వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే సురేందర్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో తనకు నష్టం జరిగిందని మదన్‌మోహన్‌రావు ఎమ్మెల్యే సురేందర్‌పై ఆగ్రహంతో ఉన్నారు. 2023 ఎన్నికల్లో సురేందర్‌ను ఓడించి ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో ఉన్న మదన్‌మోహన్‌రావు.. ఎల్లారెడ్డి నియోజకవర్గంపై దృష్టి సారించారు. అప్పటినుంచి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతూ, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో ఎల్లారెడ్డి నుంచి పోటీ చేయాలని పట్టుదలతో ఉన్న సుభాష్‌రెడ్డి సైతం సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పార్టీని బలోపేతం చేస్తున్నారు. ఇద్దరు నేతలు ఇటు పార్టీ కార్యక్రమాలతోపాటు అటు సేవా కార్యక్రమాలలో పోటీ పడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఇరువురి అనుచరులు వేర్వేరుగా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఇద్దరూ ఎల్లారెడ్డి పట్టణంలో కార్పొరేట్ తరహాలో కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే మండల కేంద్రాల్లోనూ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాకు సంబంధించిన బృందాలతో జోరుగా ప్రచారాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అప్పుడప్పుడు ఇరు వర్గాల మధ్య గొడవలూ జరుగుతున్నాయి.

అగ్రనేతను నమ్ముకున్న మదన్‌మోహన్‌రావు

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీకి సంబంధించిన బృందంతో మదన్‌మోహన్‌రావు టచ్‌లో ఉన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్కలతోనూ మంచి సంబంధాలున్నాయి. నియోజకవర్గంలో ఎవరి బలం ఎంత ఉందో సర్వేల్లో తేలుతుందని మదన్‌మోహన్‌రావు వర్గం చెబుతోంది. గెలుపు గుర్రాలకే టికెట్టు ఇస్తారని, సర్వేలను పరిగణనలోకి తీసుకుని తనకే టికెట్టు కేటాయిస్తారని మదన్‌మోహన్‌రావు ఆశతో ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడి అండతో..

వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మొదటి నుంచి పీసీసీ రేవంత్‌రెడ్డిని నమ్ముకున్నారు. రేవంత్‌రెడ్డి వెంట నడుస్తున్న తనకే టికెట్టు వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. రేవంత్‌రెడ్డి నిర్వహించిన హథ్ సే హథ్ జోడో యాత్ర సందర్భంగా ఎల్లారెడ్డి టికెట్టును జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ నిర్ణయిస్తారని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న సుభాష్‌రెడ్డి టికెట్టు తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు.

అనుచరుల్లో అయోమయం

ఇద్దరు నేతల అనుచరులు టికెట్టు విషయంలో టెన్షన్‌లో ఉన్నారు. సుభాష్‌రెడ్డికే అభ్యర్థిత్వం దక్కుతుందని ఆయన అనుచరులు.. కాదు మదన్‌మోహన్‌రావుకే అవకాశం వస్తుందని ఇయన అనుచరులు నమ్మకంతో ఉన్నారు. అయితే అధిష్టానం ఏం చేస్తుందోనని ఇరు వర్గాల్లోనూ ఆందోళన నెలకొంది. ఇద్దరు నేతలు టికెట్టు కోసం కొట్లాడుతున్న సమయంలో మధ్యేమార్గంగా మూడో వ్యక్తిని తెరపైకి తెస్తారా అన్న అంశంపైనా చర్చించుకుంటున్నారు.

'ఇక్కడి నుంచే పోటీ చేస్తా'

ఎల్లారెడ్డిరూరల్: తాను ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచే పోటీ చేస్తానని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు. బాన్సువాడ నుంచి కానీ, జహీరాబాద్ ఎంపీ స్థానంనుంచి కాని పోటీ చేయబోనని స్పష్టం చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో గాంధారి మండలం తిప్పారం సర్పంచ్ సాయిలు, లింగంపేట్ మండలం ఒంటరిపల్లి సర్పంచ్ రాజయ్య, ఎల్లారం సర్పంచ్ లక్ష్మితోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నుంచి గెలిచి అభివృద్ధి పేరిట బీఆర్‌ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే సురేందర్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. 15 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి సైతం ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో మదన్‌మోహన్‌రావు

పార్టీ టికెట్టు ఇస్తే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలుస్తానన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

నేడు జాబ్ మేళా..

ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మదన్‌మోహన్‌రావు తెలిపారు. నిరుద్యోగ యువత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాల కల్పన కోసం నిర్వహించే మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్న లక్ష్మణ్, ఆరిఫ్, తూర్పు రాజు తదితరులున్నారు.

న్యూస్‌రీల్

'ముదిరాజ్‌లకు టికెట్లు ఇవ్వకపోవడం దారుణం'



కామారెడ్డి టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ముదిరాజులంతా ఏకమై ఓటు బలాన్ని చూపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్ సీపీగా సత్యనారాయణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా సత్యనారాయణను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ ప్రస్తుతం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా రాచకొండలో పనిచేస్తున్నారు. గతంలో కరీంనగర్, రామగుండం సీపీగా, హైదరాబాద్‌లోని వెస్ట్ జోన్ డీసీపీగా పనిచేశారు. సత్యనారాయణ 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. మార్చి 31న పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు ఉద్యోగ విరమణ చేయడంతో నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇన్‌చార్జిగా ఐదు నెలలు కొనసాగారు. జిల్లాలో ఇంత కాలం సీపీ పోస్టు ఖాళీగా ఉండడం ఇదే మొదటిసారి.

సమ్మె ప్రారంభం



కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లు(డీఈవో) శుక్రవారం సమ్మె ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం ముందు శిబిరంలో సమ్మెలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆపరేటర్లకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఈవోలు బాలకృష్ణ, రాజు, సిద్ధార్థ గౌడ్, అఖిల్ గౌడ్, దివ్య, స్వాతి, గీత పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కామారెడ్డి టౌన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్న డిమాండ్‌తో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సమ్మెలో పాల్గొన్న ఏఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. డిమాండ్లను పరిశీలించాలని కోరారు. మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దశరథ్, జిల్లా అధ్యక్షుడు బాలరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకోసం శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌వోల వద్దనున్న జాబితా ఆధారంగా తమ పేర్లను, వివరాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలపాలని కోరారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'



మాట్లాడుతున్న పిట్టల రవీందర్

కామారెడ్డి టౌన్: ముదిరాజ్‌ల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర మత్స్య శాఖ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌లకు దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. వారికి వృత్తి పరంగా న్యాయం జరిగేలా త్వరలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అవకాశం ఉన్నచోట ముదిరాజ్‌లకు సొసైటీలలో సభ్యత్వం కల్పిస్తామన్నారు. ప్రతి ముదిరాజ్ కుటుంబంలో కనీసం ఒక్కరికైనా మత్స్య శాఖ సొసైటీలో సభ్యత్వం కల్పించేలా చర్యలు తీసుకుంటామని గీత పారిశ్రామిక ఫెడరేషన్ చైర్మన్ పల్లె రవిగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్, నాయకులు నీలకంఠం, చంద్రం, బుచ్చన్న, రమేష్, గోవర్ధన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ తీర్మానాలు చట్టవిరుద్ధం

- పంచాయతీ పాలకవర్గాలు, ఎమ్మెల్సీ కవితపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు



ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న షబ్బీర్ అలీ, సురేశ్ షెట్కార్, నేతలు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డినుంచి పోటీ చేయనున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు అంటూ పంచాయతీల పేరుతో ఏకగ్రీవ తీర్మానాలు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే దీన్ని సమర్థించిన ఎమ్మెల్సీ కవితపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మాచారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ఏకగ్రీవంగా మద్దతు ఇస్తున్నట్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా తీర్మానాలు చేశారని ఆరోపించారు. కామారెడ్డిలో ఓటమి భయంతో బీఆర్‌ఎస్ నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల్లో నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. చట్ట విరుద్ధంగా జరుగుతున్న ఏకగ్రీవ తీర్మానాల విషయంలో కలెక్టర్ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. చట్ట విరుద్ధ తీర్మానాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారిని కోరామన్నారు. ఎన్నికల అధికారిని కలిసినవారిలో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, నాయకులు కాసుల బాల్‌రాజు, నిరంజన్, మోహన్‌రెడ్డి ఉన్నారు.



తమలపాకులతో అలంకృతురాలైన అమ్మవారు



లక్ష తమలపాకులతో అర్చన

కామారెడ్డి టౌన్: శ్రావణ మాసంలో మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి లక్షా 11 వేల తమలపాకులతో అర్చన చేశారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూజాదుల్లో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మొగిలిపల్లి భూమేష్ గుప్తా, కోశాధికారి విశ్వనాథుల రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూర శ్రీనివాస్, ప్రతినిధులు గరిపల్లి శ్రీధర్ గుప్తా, యాద అంజయ్య, అర్చకులు కృష్ణమూర్తి శర్మ, గౌతమ్ శర్మ, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'చలో గజ్వేల్'.. ఉద్రిక్తం!

- వెంకటరమణారెడ్డి ఇంటివద్ద భారీగా బలగాల మోహరింపు
- బీజేపీ నాయకులు, కార్యకర్తల అరెస్ట్
- వాహనాలను సీజ్ చేసిన పోలీసులు



జిల్లా కేంద్రంలో వెంకటరమణారెడ్డి ఇంటి వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కామారెడ్డి టౌన్: బీజేపీ శుక్రవారం చేపట్టిన చలో గజ్వేల్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. నాయకులు, కార్యకర్తలు గజ్వేల్‌కు వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో జరిగింది అభివృద్ధి కాదని, వనరుల విధ్వంసమని ఆరోపిస్తున్న కామారెడ్డి బీజేపీ నేత వెంకటరమణారెడ్డి.. చలో గజ్వేల్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.. అయితే పోలీసులు గురువారం రాత్రే ఆయనను అరెస్టు చేసి, బిచ్కుందకు తరలించారు. అయినా గజ్వేల్ యాత్రను కొనసాగించాలని పార్టీ నాయకులు నిర్ణయించి, శుక్రవారం ఉదయం వెంకటరమణారెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. పంచముఖి హనుమాన్ కాలనీలో వాహనాలను అందు బాటులో ఉంచారు. వీరిని అడ్డుకోవడానికి భారీగా పోలీసు బలగాలను మోహరించారు. వాహనాలను సీజ్ చేసి దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గజ్వేల్‌కు వెళ్లకుండా బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో.. వందలాది మంది వెంకటరమణారెడ్డి ఇంటి వద్దే కూర్చొని నిరసన తెలిపారు. నాయకులను అరెస్టు చేయడానికి యత్నించగా.. తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ నాయకులను అరెస్టు చేసి వేరువేరు పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. బైక్‌లపై గజ్వేల్‌కు వెళ్తున్న కొందరిని నిజాంసాగర్ చౌరస్తాలో పోలీసులు అడ్డుకున్నారు.

పోలీసులకు చుక్కలు చూపించిన కార్యకర్తలు

బీజేపీ నేతలు నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తారన్న సమాచారంతో పోలీసులు భారీగా మోహరించారు. అయితే బీజేపీ కార్యకర్తలు నిజాంసాగర్ చౌరస్తాలో కాకుండా బస్టాండ్ వద్ద కాసేపు రాస్తారోకో చేశారు. పోలీసులు వచ్చేలోపే వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. ఎక్కడ ఆందోళనలు చేస్తారోనని పోలీసులు అయోమయానికి గురయ్యేలా చేసి చుక్కలు చూపించారు.



బీజేపీ శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు

రాష్ట్రానికి కేసీఆర్ గ్రహణం

- కామారెడ్డోళ్లు గజ్వేల్ అభివృద్ధేంటో చూడొద్దా?
- అరెస్టులతో గజ్వేల్‌లో ప్రగతి లేదని తేలిపోయింది
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శలు
- జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు భారీ ర్యాలీ



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కామారెడ్డి టౌన్: గజ్వేల్‌తో పాటు రాష్ట్రానికి కేసీఆర్ గ్రహణం పట్టిందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. బీజేపీ నేత వెంకటరమణారెడ్డిని బిచ్కుంద పోలీస్ స్టేషన్‌నుంచి విడుదల చేసిన తర్వాత రాత్రి కామారెడ్డిలో ర్యాలీ తీశారు. దేవునిపల్లి నుంచి జన్మభూమిరోడ్, కొత్తబస్టాండ్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభతోపాటు పార్టీ కార్యాలయంలో విలేకరులతో రఘునందన్‌రావు మాట్లాడారు. గజ్వేల్‌ను అభివృద్ధి చేశామని సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత చెప్పారని.. ఆ అభివృద్ధిని కామారెడ్డి ప్రజలు చూడవద్దా అన్నారు. చలో గజ్వేల్ చేపట్టిన వెంకటరమణారెడ్డిని 20 గంటల పాటు ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని ఎస్పీని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని కామారెడ్డి ప్రజలకు చూపిస్తామని మూడు రోజుల ముందే వెంకటరమణారెడ్డి ప్రకటించారని, వారికి రెడ్ కార్పెట్ వేసి ప్రగతిని చూపించాల్సింది పోయి అరెస్టులు చేస్తారా అని నిలదీశారు. గజ్వేల్‌లో ఎంత మందికి దళిత బంధు, గొర్రెలు, బర్రెలు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారో చెప్పాలన్నారు. వెంకటరమణారెడ్డి అరెస్టు, విడుదల సీఎంకు చెంప, చెప్పు దెబ్బ అన్నారు. బీజేపీ నేతల అరెస్టుల వల్ల గజ్వేల్ ప్రాంతంలో అభివృద్ధి జరగలేదని తేలిపోయిందన్నారు.

కామారెడ్డిలో ఏకగ్రీవాల పేరిట రాజ్యాంగాన్ని, స్వేచ్ఛగా ఓట్లు వేసే హక్కును సీఎం కేసీఆర్ కాలరాస్తున్నారని రఘునందన్‌రావు ఆరోపించారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న జీపీలకు ఇప్పటివరకు నజరానాల దిక్కులేదన్నారు. సీఎంకు ప్రజలను మోసం చేయడం కొత్తేమీ కాదన్నారు. దేశంలో జమిలి ఎన్నికలు కొత్తకాదన్నారు. ముదిరాజ్‌లు, ఇతర బీసీలు, మైనారిటీలు, దళితులకు అసెంబ్లీ సీట్లను కేటాయించకుండా దొర పాలన సాగిస్తున్న సీఎంను ప్రజలు ఇంటికి సాగనంపుతారన్న ధీమాను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మాల్యాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



కామారెడ్డి టౌన్/కామారెడ్డి రూరల్: తమ డిమాండ్‌లను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమగ్ర శిక్ష విద్యాశాఖ ఉద్యోగుల సమ్మె శుక్రవారానికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వినూత్నంగా నిరసన చేపట్టారు. ఎమ్మెల్సీ కవిత మాస్కులను ముఖాలకు పెట్టుకుని మహిళా ఉద్యోగులు పసుపు, బొట్టు వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కవితను కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు దామోదర్, వీణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- నాలుగు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పెద్దమల్లారెడ్డి, కంచర్ల, మల్లుపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయడంతో సరిగ్గా రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అనంతరం 15 నిమిషాల తర్వాత తిరిగి అంతరాయమేర్పడడంతో స్థానిక విద్యుత్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కామారెడ్డి నుంచి విద్యుత్ ఉన్నతాధికారులు వచ్చి మరమ్మతులు ప్రారంభించారు.

4 లోపు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోండి

బాన్సువాడ రూరల్: ఇంటర్ పాసైన విద్యార్థులు ఈనెల 4లోపు అడ్మిషన్లు తీసుకోవాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ శుక్రవారం కోరారు. బీఏ ఇంగ్లిష్ మీడియంలో 50 సీట్లు, తెలుగు మీడియంలో 33 సీట్లు, బీకామ్ కంప్యూటర్ కోర్సులో 80తో పాటు లైఫ్‌సైన్స్ కోర్సులో 62, ఫిజికల్ సైన్స్‌లో 117 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

బీఆర్‌ఎస్ మనుగడ కోల్పోయింది

- కాంగ్రెస్ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి



లింగంపేట(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలో మనుగడ కోల్పోయిందని కాంగ్రెస్ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి న్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి ప్రజలను కలిశారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక బీఆర్‌ఎస్ పార్టీ చేతులెత్తేసిందని అన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నొక్కి వక్కాణించి చెప్పారు. ప్రజలు ఆలోచించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు.

కల్వకుంట్ల రాజ్యాంగాన్ని అడ్డుకుంటాం



పెద్దకొడప్‌గల్‌లో ఎమ్మెల్యే రఘునందన్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



నిజాంసాగర్‌లో రఘునందన్ రావు, రమణారెడ్డిలను అభినందిస్తున్న నేతలు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్: ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేసే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని, కానీ సీఎం కేసీఆర్‌కు అంబేడ్కర్ రాసిన ఆ రాజ్యాంగం నచ్చడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శించారు. కల్వకుంట్ల రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తే భారతీయ జనతాపార్టీ అడ్డుకుంటుందని పేర్కొన్నారు. బిచ్కుంద పీఎస్‌లో ఉన్న వెంకటరమణారెడ్డిని పరామర్శించేందుకు వెళ్తున్న రఘునందన్‌రావును పెద్దకొడప్‌గల్‌లో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. వెంకటరమణారెడ్డిని విడుదల చేసేంత వరకు తాను ఇక్కడి నుంచి వెళ్లబోనన్నారు. ఆయన సుమారు రెండు గంటలపాటు రోడ్డుపైనే ఉన్నారు. పోలీసులు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి వెంకటరమణారెడ్డిని విడుదల చేయడంతో ఆయన కామారెడ్డికి పయనమయ్యారు. నిజాంసాగర్‌లోని గాంధీ చౌరస్తా వద్ద ఆయనతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డిలను పార్టీ శ్రేణులు సన్మానించాయి. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. గతంలో తెలంగాణ ఉద్యమం చేసినప్పుడు ఆంధ్రా పాలకులు కూడా ఇంత దుర్మార్గంగా వ్యవహరించలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అధికారులు తమ పోస్టింగ్‌లు, ఇతరత్రా కారణాలతో బీజేపీ కార్యకర్తలను పశువులను బాదినట్టు బాదడం దుర్మార్గమైన చర్య అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా అభివృద్ధి చెందిందని సీఎం చెబుతారని, మరి బీజేపీ నేతలు గజ్వేల్‌కు వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులను అడ్డుకోవడం అంటే గజ్వేల్ అభివృద్ధి చెందలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఒప్పుకున్నట్లేనా అని ప్రశ్నించారు. తనను పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో అడ్డుకున్న పోలీసులకు కనీసం బ్యాడ్జీలు లేవని, వారు నిజమైన పోలీసులా లేక ప్రభుత్వ ఏజెంట్లా అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసే సమయంలో నాయకులతో పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, వారిపై సోమవారం మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, బాన్సువాడ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ వెళ్లి తీరుతాం

- కేసులు, అరెస్టులకు భయపడం
- బీజేపీ నేత వెంకటరమణారెడ్డి

బిచ్కుంద: సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, అక్కడికి వెళ్లి బండారం బయటపెడతామని బీజేపీ కామారెడ్డి ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆయనను పోలీసులు జిల్లాకేంద్రంలో అరెస్ట్ చేసి, బిచ్కుంద పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఆయన బిచ్కుందలో మాట్లాడారు. గజ్వేల్‌లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. అక్కడికి వెళ్తే బీఆర్‌ఎస్ నాయకుల అక్రమాలు, ప్రజలపై దౌర్జన్యాలు, రింగ్ రోడ్డులో అవినీతి, భూకబ్జాలు బయట పడతాయన్న భయంతోనే ప్రభుత్వం తమను అడ్డుకుంటోందన్నారు. కేసులు, అరెస్టులకు భయపడబోమని బీజేపీ నేత వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఓడిపోతానన్న భయంతోనే సీఎం కేసీఆర్ రెండు స్థానాలనుంచి పోటీ చేస్తున్నారన్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ బీజేపీ చేతిలో ఓడిపోవడం ఖాయమన్నారు.

బిచ్కుంద స్టేషన్‌లో నిర్బంధం

వెంకటరమణారెడ్డిని గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించారు. గాంధారి, బాన్సువాడ మీదుగా జుక్కల్‌కు తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు.. రాత్రి 3 గంటల ప్రాంతంలో జుక్కల్ మండలంలోని మహమ్మదాబాద్ తండా వద్ద పోలీసుల వాహనానికి అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు వెంకటరమణారెడ్డిని బిచ్కుందకు తరలించారు. బీజేపీ నాయకులు పలువురు బిచ్కుంద చేరుకుని వెంకటరమణారెడ్డిని పరామర్శించారు. ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన



బిచ్కుందలో ఆందోళన చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

బిచ్కుంద: వెంకటరమణారెడ్డిని వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె బిచ్కుంద పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. దీంతో ఎస్సై మురళి ఉన్నతాధికారులతో మాట్లాడారు. వారి ఆదేశాలతో వెంకటరమణారెడ్డిని విడుదల చేశారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ బీజేపీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణతో బీఆర్‌ఎస్ మంత్రులు, నాయకులకు వణుకు పుడుతోందన్నారు. అందుకే అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల కోసం బీజేపీ నాయకులు జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కిష్టారెడ్డి, విష్ణు, పండరి నాయక్, శివాజీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 2006–07 పూర్వ విద్యార్థులు లొంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు భాస్కర్, శేఖర్, రంజిత్, సురేశ్, సుమన్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, దీపక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



దత్తు మృతదేహం

వర్ని: జాకోర గ్రామానికి చెందిన చెంద దత్తు (50) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ శుక్రవారం తెలిపారు. తాగుడికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుని కుమార్తె సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుమారుడి మరణం తట్టుకోలేక..



చాకలి అక్కవ్వ మృతదేహం

బాన్సువాడ: కుమారుడి మరణాన్ని తట్టుకోలేని చాకలి అక్కవ్వ (64) అనే వృద్ధురాలు చెరువులో పడి ఆత్మహత్య చేసుకుందని బీర్కూర్ ఎస్సై నర్సింహులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన అక్కవ్వ చిన్న కుమారుడు ఏడాది క్రితం మృతి చెందాడు. నాటి నుంచి కుమారుడి మృతిని గుర్తు చేసుకుంటూ మానసికంగా బాధపడేది. గురువారం సైతం రాఖీ పండుగ ఉండడంతో చాలా బాధపడిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. అక్కవ్వ పెద్ద కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన నిమ్మ బాబు(55) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. మృతుడి భార్య నిమ్మ బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

మాక్లూర్: ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి నివాసపు గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సుమయ్య గుడిసెలో శుక్రవారం ప్రమాదవశాత్తు సిలెండర్ పేలడంతో రూ. లక్ష 10 వేల నగదుతోపాటు టీవీ, ఫ్రిజ్, బీరువా దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

హాస్టల్ వార్డెన్‌పై దాడి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నాందేవ్‌వాడ ఎస్సీ సంక్షేమ వసతి గృహ వార్డెన్ సత్యంపై నవీన్ అనే విద్యార్థి దాడి చేశాడు. వసతి గృహంలో ఉంటున్న నవీన్ తన స్నేహితుడికి వసతి గృహంలో సీటు లభించక పోవడంతో వార్డెన్‌పై దాడి చేశాడు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు దీనిపై విచారణ చేపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఓ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించినట్లు తెలిసింది.

ఏఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొన్న ఏ ఎన్ఎంలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారులు ఆరుగురికి షోకాజ్ నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న ఐదుగురు ఏఎన్ఎంలు రిపోర్టు చేయగా డొంగ్లి పీహెచ్‌సీ పరిధిలో ఒకరు స్పందించలేదు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని రమేశ్‌గౌడ్(43) మృతిచెందాడు. ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రమేశ్ మామిడిపల్లి చౌరస్తా నుంచి ఆర్మూర్‌వైపు బైక్‌పై వస్తుండగా వెనుకు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుని భార్య సహితి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

ఎల్లారెడ్డి: మండలంలోని అడివిలింగాల గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి..



షేక్ యూసుఫ్ మృతదేహం

వర్ని: జలాల్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ (36) గ్రామ చెరువులో స్నానానికి వెళ్లి నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ శుక్రవారం తెలిపారు. చెరువులో మృతదేహం తేలడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి భార్య అక్బరి బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో ఒకరి గల్లంతు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ నల్లకుంట చెరువులో చెంచయ్య (42) అనే వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై ఎల్ రాము శుక్రవారం తెలిపారు. చెంచయ్య వారం రోజుల క్రితం ఇటుక బట్టీలో పని చేసేందుకు నెల్లూర్ నుంచి వచ్చాడని శుక్రవారం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇటుక బట్టీ యజమాని రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

ధర్పల్లి: మండలంలోని హొన్నాజిపేట్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.15350 నగదును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు నిందితుల పట్టివేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బోరు బావుల వద్ద కేబుల్ వైర్లు చోరీ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకొని చితకబాదారు. అనంతరం నిందితులను పోలీసులకు అప్పగించారు.

బాలికపై అత్యాచారం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సైలానీబాబా కాలనీకి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడినట్లు పట్టణ సీఐ నరేశ్ తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గజ్వేల్‌లో అభివృద్ధి ఎక్కడుందో చూయించాలి

- మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న బీజేపీ నేత యెండల

రామారెడ్డి: గజ్వేల్ మోడల్ అని చెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు, ఎమ్మెల్సీ కవిత అభివృద్ధి ఎక్కడుందో చూయించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. అభివృద్ధి పనులు చూడడానికి గజ్వేల్‌కు వెళ్తున్న కామారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డితో, పార్టీ నాయకులను అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులను అడ్డుకోవడాన్ని చూస్తుంటే సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో ఏ మేరకు అభివృద్ధి చేశారో తెలుస్తోందని అన్నారు. గజ్వేల్‌లో లేని అభివృద్ధి కామారెడ్డిలో పోటీ చేసి ఏం చేస్తారని ప్రశ్నించారు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి కేసీఆర్‌పై ఘన విజయం సాధిస్తారని యెండల ధీమా వ్యక్తం చేశారు. బీజేపి పట్టణ అధ్యక్షుడు విపుల్‌జైన్, నరేందర్, ప్రవీణ్, ప్రసాద్, నాయకులు ఉన్నారు.

రామారెడ్డి ఎస్సై అత్యుత్సాహం..

పోలీస్‌స్టేషన్‌లో యెండల ప్రెస్‌మీట్‌ను కవర్ చేస్తున్న విలేకర్లపై ఎస్సై సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్30(ఏ) యాక్టు అమల్లో ఉందని, ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న బీజేపీ నేతలను వదిలేసి విలేకరులపై చిందులేశారు. పీఎస్‌లో గతంలో ఎంపీ అర్వింద్ ప్రెస్‌మీట్ నిర్వహించినా పట్టించుకోని పోలీసులు యెండల లక్ష్మీనారాయణ ప్రెస్‌మీట్‌పై విలేకర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

ఎక్సైజ్ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లోని అధికారుల పాత ఫోన్‌నంబర్ల స్థానంలో ఈ నెల 1 నుంచి కొత్తవి అందుబాటులో ఉంటాయని డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ దశరథం శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ప్రదేశం	హోదా	సెల్
నిజామాబాద్	ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్	8712658966
నిజామాబాద్	ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)	8712658967
నిజామాబాద్	ఎక్సైజ్ సూపరింటెండెంట్	8712658968
కామారెడ్డి	ఎక్సైజ్ సూపరింటెండెంట్	8712658969
నిజామాబాద్	ఎస్‌హెచ్‌వో	8712658973
ఆర్మూర్	ఎస్‌హెచ్‌వో	8712658974
బోధన్	ఎస్‌హెచ్‌వో	8712658975
భీమ్‌గల్	ఎస్‌హెచ్‌వో	8712658976
మోర్తాడ్	ఎస్‌హెచ్‌వో	8712658977
కామారెడ్డి	ఎస్‌హెచ్‌వో	8712658985
దోమకొండ	ఎస్‌హెచ్‌వో	8712658986
ఎల్లారెడ్డి	ఎస్‌హెచ్‌వో	8712658987
బాన్సువాడ	ఎస్‌హెచ్‌వో	8712658988
బిచ్కుంద	ఎస్‌హెచ్‌వో	8712658989

మలేషియా బాధితులు స్వదేశానికి

- సహాయం చేసిన ఎంపీ బీబీ పాటిల్



ఎంపీ బీబీ పాటిల్



స్వదేశానికి వస్తున్న మలేషియా బాధితులు

కామారెడ్డి రూరల్: తమ పాస్‌పోర్టులు జప్తు చేశారని, తినడానికి తిండి లేక, చేయడానికి పని లేక ఇబ్బందులు పడుతున్నామని తమను ఎలాగైనా స్వదేశానికి పంపించాలని బతుకు దెరువు కోసం మలేషియా దేశానికి వెళ్లిన కామారెడ్డి జిల్లాకు చెందిన కొంతమంది బాధితులు, ఎంపీ బీబీ పాటిల్‌కు విన్నవించారని ఎంపీ వ్యక్తిగత మీడియా ఇన్‌చార్జి లెగ్గల రాజు తెలిపారు. ఎంపీ బీబీ పాటిల్ స్పందించి భారత్, మలేషియా విదేశాంగ మంత్రిత్వ శాఖల అధికారులతో మాట్లాడి వారి యజమాని నుంచి పాస్‌పోర్ట్‌లు ఇప్పించారని వివరించారు. బాధితుల వద్ద స్వదేశానికి రావడానికి కూడా డబ్బులు లేకపోవడంతో ఎంపీ తన సొంత డబ్బులు వెచ్చించి టిక్కెట్లు కొని ఇచ్చారని రాజు తెలిపారు. ఈ రోజు సాయంత్రం 6 గంటలకు బాధితులు హైదరాబాద్‌కు చేరుకుంటారని చెప్పారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

ఎడపల్లి(బోధన్): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు పాపారావు పండిస్తున్న సేంద్రియ ఎరువుల పంటను జేడీఏ శుక్రవారం పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ విద్యార్థులు తమ ఫీల్డ్ వర్క్‌లో భాగంగా వారికి అధికారులు సేంద్రియ ఎరువుల పంటలను చూపించి వాటి గురించి వివరించారు. అనంతరం పంటలపై పిచికారీ చేయడానికి రైతు పాపారావు తయారు చేస్తున్న జీవామృతం ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. జేడీఏ వెంట ఎడపల్లి ఏవో సిద్ధిరామేశ్వర్, సప్తగిరి, కృషి విజ్ఞాన కేంద్రం విద్యార్థులు ఉన్నారు.

అనుమానమే పెనుభూతమై..

- పెళ్లయిన నాలుగు నెలలకే భార్యను కడతేర్చిన భర్త
- రోడ్డు ప్రమాదంలో నిందితుడు దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: పెళ్లయిన నాలుగు నెలలకే వారి సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. మూడు ముళ్లు.. ఏడు అడుగులు వేసి చివరి వరకూ తోడుగా ఉంటానని బాస చేసిన భర్తే.. అతికిరాతకంగా భార్యను హత్య చేశాడు. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడానికి వెళ్తూ.. ఆగి ఉన్న లారీని ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటనలు ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో జరిగాయి. ఆ రెండు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బంగారుగూడకు చెందిన జయవంత్‌రావు–పద్మల కుమారుడు మోహితే అరుణ్‌కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన గోపీచంద్–లక్ష్మిల చిన్న కుమార్తె దీప(22)తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన నాటి నుంచి దీపపై అరుణ్ అనుమానం పెంచుకున్నాడు. ఆషాఢ మాసానికి పుట్టింటికి వెళ్లిన దీప నాలుగు రోజుల క్రితం అత్తారింటికి వచ్చింది. భార్యపై కక్ష్య పెంచుకున్న అరుణ్ శుక్రవారం తెల్లవారుజామున దీప తలను మంచానికి బాది హత్య చేశాడు.

లొంగి పోదామని..

అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవడానికి ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. దీప విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన అరుణ్ తల్లిదండ్రులు అరుణ్‌కు సమాచారం అందించారు. తాను పీఎస్‌కు వెళ్తున్నట్లు చెప్పగా ఇంటికి రావాలని వారు కోరారు. అరుణ్ తిరిగి ఇంటికి వస్తుండగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాలకు చేరుకొని విచారణ చేపట్టారు. తమ కుమార్తె హత్యకు గురైందన్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబీకులు రిమ్స్ దవాఖానకు చేరుకొని బోరున విలపించారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అరుణ్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు.

బాల్కొండలో విషాదఛాయలు..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన గోపీచంద్, లక్ష్మీ దంపతుల చిన్న కుమార్తె దీప(22) ఆదిలాబాద్‌లో భర్త అరుణ్ చేతిలో హత్యకు గురవడంతో మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త పెడుతున్న వేధింపులు తాళలేక దీప ఇటీవల తల్లిగారింటికి వచ్చింది. పెద్దల సమక్షంలో రాజీ కుదరగా శుక్రవారం హత్యకు గురవడంతో బాల్కొండలో విషాదఛాయలు నెలకొన్నాయి.

హోటల్‌లో బ్యాగ్ చోరీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఉన్న ఓ మెస్‌లో బంగారు బ్యాగ్ చోరీకి గురైంది. మోపాల్ మండలంలోని సిర్‌పూర్‌కు చెందిన గోపాల్ తన కుటుంబీకులతో కలిసి బస్టాండ్‌కు వచ్చి ఓ మెస్‌లో భోజనం చేశారు. వారి వెంట ఉన్న బంగారు బ్యాగ్‌ను అక్కడే మరిచిపోవడంతో గమనించిన సిబ్బంది హోటల్ యజమానికి అందించారు. ఇంతలో ఈ బ్యాగ్ తమదేనంటు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు హోటల్ యజమాని తెలిపారు. బ్యాగులో రెండు తులాల బంగారు కమ్మలు, ఉంగరాలు, 20 తులాల వెండి, రూ.1500 నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు పేర్కొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని అయ్యప్పనగర్‌లో చోరీ జరిగినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన నరేందర్ ఇంట్లో దుండగులు బీరువా తాళం పగులగొట్టి 12 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. తాను కిరాణ దుకాణానికి వెళ్లి వచ్చిన సమయంలో చోరీ జరిగిందని బాధితురాలు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తల్లీ కుమారుడు అదృశ్యం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో మహారాష్ట్రలోని తానే జిల్లాకు చెందిన ఎర్రోళ్ల స్వరూప, కుమారుడు శశాంక్ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆగస్టు 28న నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తానేకు వెళ్తున్నట్లు తమకు సమాచారం అందించినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన కత్తి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మంగళ్‌పాడ్‌లో ఒకరు..



సాయిలు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన పుట్టి సాయిలు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయిలుకు మతి స్థిమితం సరిగా లేదని 20 రోజుల క్రితం ఇంటి నుంచి తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.